ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

3★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 5 సెప్టెంబరు 2025



గంగమ్మ పైపైకి..

- సగటు భూగర్భ జలమట్టం 7.60 మీటర్ల లోతులో..
- ఖరీఫ్‌తో పాటు యాసంగి సాగుకు భరోసా
- ప్రాజెక్టులు, చెరువులకు జలకళ
- నిండుకుండలా మిడ్ మానేరు..
- సిరిసిల్లకు చేరిన బ్యాక్ వాటర్
- కొనసాగుతున్న నీటి ఎత్తిపోతలు

జిల్లాలో భూగర్భ జలాలు (మీటర్లలో)

మండలం	ఆగస్టు-2024	ఆగస్టు-2025
బోయినపల్లి	3.33	4.48
చందుర్తి	2.68	3.90
గంభీరావుపేట	3.16	7.50
ఇల్లంతకుంట	4.97	3.51
కోనరావుపేట	5.09	7.94
ముస్తాబాద్	11.71	8.23
రుద్రంగి	12.58	3.94
సిరిసిల్ల	5.61	10.52
తంగళ్లపల్లి	8.94	8.16
వీర్నపల్లి	8.19	11.15
వేములవాడ రూరల్	2.14	4.59
వేములవాడ అర్బన్	4.39	15.55
ఎల్లారెడ్డిపేట	8.07	14.52
జిల్లా సరాసరి	8.15	7.60



జలకళతో సింగారం మైసమ్మ చెరువు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రైతుల్లో ఆశలు నింపుతూ భూగర్భ జలమట్టం పెరుగుతోంది. నైరుతిపై ఆశలు చాలించుకున్న రైతులకు అల్ప పీడన ప్రభావంతో కురిసిన వర్షాలు ఆశాజనంగా మారాయి. ప్రస్తుత ఖరీఫ్ సాగుతో పాటు యాసంగి సాగుకు ఢోకా ఉండదని రైతులు భావిస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఆగస్టులో కురిసిన వర్షాలు సగటు లోటు వర్షపాతాన్ని తీర్చాయి. జిల్లాలో 20 రోజులపాటు కురిసిన వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలకు జలకళ వచ్చింది. గంగమ్మ పైపైకి చేరుతోంది. జిల్లాలో సగటు భూగర్భ జలాలు 7.60 మీటర్లకు ఖరీఫ్ దిగుబడి ఆశలు కల్పించింది. ఆగస్టులో విస్తారంగా కురిసిన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సాగు పనుల్లో రైతుల సందడి కనిపిస్తోంది.

జిల్లాలో పెరిగిన జలమట్టం

రాజన్నసిరిసిల్ల జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం 7.60మీటర్లవరకు వచ్చింది. 2024 సంవత్సరం ఆగస్టులో జిల్లాలో 8.15 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా, ఈ సంవత్సరం మే మాసంలో 11.01 మీటర్లు, జూలైలో 9.35మీటర్లు, ఆగస్టులో 7.60మీటర్లలో ఉన్నాయి. ఆగస్టులో కురిసిన వర్షాలు భూగర్భజలాల సమృద్ధిని పెంచింది.ఇల్లంతకుంట మండలంలో 3.51 మీటర్లలోని భూగర్భజలాలు ఉండగా, వేములవాడ అర్బన్ మండలంలో 15.55 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 573.5మిల్లీమీటర్లు ఉండగా, 621.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 8.0శాతం ఎక్కువగా ఉంది. అయితే రుద్రంగి మండలంలో లోటు వర్షపాతం ఉండగా, ఇల్లంతకుంట మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పది మండలాల్లో సాధారణ వర్షపాతం ఉంది.

వర్షాలు సమృద్ధిగా కురవడంతో జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి

- మిగతా 6లో

జిల్లాలో ఇప్పటి వరకు వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మండలం	సాధారణం	కురిసింది
రుద్రంగి	633.2	500.4
చందుర్తి	651.4	624.2
వేములవాడ రూరల్	614.6	584.2
బోయినపల్లి	544.8	528.6
వేములవాడ	627.3	638.0
సిరిసిల్ల	597.5	534.3
కోనరావుపేట	538.4	560.8
వీర్నపల్లి	572.3	643.9
ఎల్లారెడ్డిపేట	562.5	599.0
గంభీరావుపేట	545.3	714.7
ముస్తాబాద్	487.7	653.5
తంగళ్లపల్లి	605.6	703.9
ఇల్లంతకుంట	474.4	788.6
సగటు వర్షపాతం	573.5	621.1

సర్దాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత..

- విద్యాసామగ్రిని అందించిన పోలీస్ అధికారులు, సిబ్బంది



విద్యాసామగ్రిని అందిస్తున్న పోలీస్ అధికారులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతను అందిస్తామని 17వ పోలీస్ బెటాలియన్ ఆర్ఎస్ఐ తిరుపతి అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎంఐ సురేష్ సూచనల మేరకు గురువారం బెటాలియన్‌లోని ఎ కంపెనీ సిబ్బంది, అధికారులు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ పెన్నులు, ప్లేట్స్, యూనిఫాం టై, బెల్ట్‌లు, షూలతో పాటు ఇతర విద్యాసామగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో బెటాలియన్‌కు ఎ కంపెనీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గ పరిధిలోని విద్యాసంస్థలకు నిధులు మంజూరుచేసినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని చందుర్తి కేజీబీవీకి రూ.58 లక్షలు, కోనరావుపేట రూ.56 లక్షలు, రుద్రంగి రూ.8లక్షలు, వేములవాడ రూరల్ రూ.8లక్షలు, వేములవాడ అర్బన్ మండలానికి రూ.5లక్షలు, రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.36 లక్షల9వేలు, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.24 లక్షల 15వేలు, కొనరావుపేట రూ.19 లక్షలు, చందుర్తి రూ.18 లక్షల 47వేలు మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరం

కోనరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజలకు గొప్ప వరమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన 32 మంది లబ్ధిదారులకు 10 లక్షల 20వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, చేపూరి గంగాధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, కాంగ్రెస్ నాయకులు సదానందం, మానుక సత్యం, పెంతల శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూడాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూపతిరుపతిరెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత అధ్యక్షతన సమావేశం జరిగింది. స్థానిక 35వ వార్డు మహిళ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం 35 వార్డు అధ్యక్షురాలు ఆడెపు లావణ్య, ప్రధాన కార్యదర్శి బండారి లావణ్య, ఉపాధ్యక్షురాలు గంజి లక్ష్మి, కొక్కుల సంధ్య, కార్యదర్శి బీ అశ్విని నియామక పత్రాలను అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, మహిళ సభ్యులు పాల్గొన్నారు.



వినాయకుడి వద్ద ఎస్పీతో కలిసి పూజలు చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

గోవుల సంరక్షణకు సహకరించాలి

- తెలంగాణ ప్రాంత గోరక్షక్ టోలీ రాధాకృష్ణ

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గోవుల సంరక్షణకు పోలీసులు, ప్రజల సహకరించాలని తెలంగాణ ప్రాంత గోరక్షక్ టోలీ రాధాకృష్ణ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లోని విశ్వానంద యూత్ అధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద వితరణకు ఎస్పీ మహేష్‌బిగీతే, రాధాకృష్ణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చేపూరి నాగరాజు హాజరై ప్రత్యేక పూజలు చేసి అన్నదానంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ పట్టణ అధ్యక్షుడు గుంటుక పురుషోత్తం, నిర్వహకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అన్నదానం

- పాల్గొన్న కలెక్టర్, ఉద్యోగులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వినాయకుడి మండపం వద్ద గురువారం జిల్లా ఉద్యోగులతో పాటు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఉద్యోగులకు వడ్డిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

పాఠశాలల్లో నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- విద్యార్థులకు విద్య, రుచికరమైన భోజనం అందించాలి - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు విద్యార్థులకు విద్య, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, రాగట్లపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం గ్యాస్ సిలిండర్లపై తయారు చేయాలని పేర్కొన్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి రోజు అన్ని పాఠ్యాంశాలు చదివించడం, రాయించడం చేయాలని పేర్కొన్నారు. నారాయణపూర్‌లో పాఠశాల ఎదుట ప్రాంతం అపరిశుభ్రంగా కనిపించడంతో ఇదేనా పారిశుధ్యం అంటూ పంచాయతీ కార్యదర్శి జాఫర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు నీటి, తాగు నీటి సమస్యల తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాగట్లపల్లిలో పాఠశాల ప్రహరీ గోడ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ప్రహరీ గోడను నిర్మించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైన రహదారులకు మరమ్మతు పనులు చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలన్నారు. మండలంలోని బండలింగంపల్లి గ్రామ శివారులోని మానేరు వాగుపై ఉన్న వంతెన వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. వాగు పరిసరాలు, ఉధృతిపై ఆరా తీశారు. అప్రోచ్ రహదారి పనులను ప్రారంభించి పది రోజుల్లో పూర్తిచేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సత్తయ్య, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గురు దేవోభవ...

- జిల్లా స్థాయి పురస్కారాలకు 17 మంది ఎంపిక

- కలెక్టరేట్‌లో సన్మానాలు.. అవార్డుల ప్రదానం

- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఉపాధ్యాయ వృత్తి ప్రపంచంలోనే గౌరవప్రదమైనది. అంతులేని విజ్ఞానానికి ప్రతిరూపంగా విద్యావ్యవస్థ కొనసాగుతోంది. విద్యార్థులను సమాజానికి పనికొచ్చే బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయులకు ఉంది. భారతీయతత్వానికి మారుపేరుగా ఉపాధ్యాయ లోకానికి విశేష గౌరవం కల్పించిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజు సెప్టెంబరు 5న దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను ప్రభుత్వం గౌరవించుకుంటోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయిలో 17 మంది ఉపాధ్యాయులను అవార్డులకు ఎంపిక చేశారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వీరికి అవార్డులను అందించి సత్కరించనున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ప్రధానోపాధ్యాయులు, స్కూల్‌అసిస్టెంట్‌లు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్, సెకండరీ గ్రేడ్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చాకినాల శ్రీనివాస్, గుర్రం కృష్ణారెడ్డి, కైరి పద్మ, సీహెచ్ సత్తయ్య, గోలి రాధాకిషన్, అరుకాల బాల్‌రెడ్డి, బొగ్గారపు నవీన్, కట్ట రవీందర్, గోవులకొండ శ్రీనివాస్, ఎన్ దేవేందర్, ఎన్ నాగమణి, జంగిటి రాజు, పీచు సుభాష్‌రెడ్డి, జీ మహేందర్‌రావు, డి ప్రవంతి, బి రవీందర్, వి పద్మకళలకు అవార్డులను అందించనున్నారు.

నేడు జిల్లాలో రేషన్ షాపుల బంద్

సిరిసిల్ల టౌన్, సెప్టెం బరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర చౌకధరల దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు శుక్రవారం షాపులు బంద్ పాటించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు, ప్ర ధానకార్యదర్శి వి సత్యానారాయణలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఎదుట కార్మికుల ధర్నా

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గతంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలి... అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ప్రధా న ఆసుపత్రిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులు ఆసుపత్రి ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్ సీఐటీయూ నాయకులు, కార్మికులు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆసుపత్రి కార్మికులు, సిబ్బంది నాగమణి, భాగ్య, జయ, లత, లావణ్య, లలిత, రమ, అంజయ్య, రాము, వీణ, స్నేహ, మమత, పుష్పలత, పాల్గొన్నారు.



శోభాయాత్రలో ఒగ్గుడోలు వాయిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పక్కన ప్రతాప రామకృష్ణ

క్రేన్ సహాయంతో గుడిచెరువులో భారీ గణేష్ నిమజ్జనం..

గంగమ్మ ఒడికి గణపయ్య..

- వేములవాడలో ఘనంగా వినాయకుల నిమజ్జనం
- వేడుకలకు హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీలు



వినాయకులను ఎడ్లబండ్లపై నిమజ్జనానికి తీసుకువస్తున్న నిర్వాహకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో గురువారం రాజన్న ఆలయ గుడి చెరువులో మున్సిపల్ ఆధ్వర్యంలో నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో 5 భారీ క్రేన్‌లను, పదిమంది గజ ఈతగాళ్లతో పాటు గుడి చెరువులో బోట్ సౌకర్యాన్ని కల్పించారు. గుడి చెరువులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను, గణేష్ నిమజ్జనోత్సవాలను చూసేందుకు పట్టణ ప్రజలు, భక్తులు తరలివచ్చారు. నిమజ్జనోత్సవాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గుడి చెరువులో ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు ముందు రాజన్న ఆలయంలో ప్రతిష్టించిన

- మిగతా 6లో



గాంధీనగర్‌లో నృత్యాలు చేస్తున్న మహిళలు



గంగమ్మ ఒడిలోకి చేరుతున్న గణపయ్య



నిమజ్జనానికి తరలుతున్న రాజన్న ఆలయంలోని వినాయకుడు..

మావోయిస్టులు గోపగాని ఐలన్న, కుమారస్వామిల తల్లి మృతి


కొమరమ్మ(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు గోపగాని ఐలన్న, కుమరస్వామిల తల్లి గోపగాని కొమరమ్మ(92) మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో గురువారం ఉదయం మృతి చెందారు. గోపగాని కొమరమ్మకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె కాగా ఇద్దరు కుమారులు గోపగాని బలన్న, గోపగాని కుమరస్వామిలు నాటి పీపుల్స్‌వార్ పార్టీలో క్రియాశీల కంగా పనిచేశారు. గోపగాని కుమారస్వామి 1979లో కమలాపూర్ మండలం గూడూరులో ఏర్పడిన తొలి దళంలో సభ్యుడిగా చేరారు. దళంలో పనిచేస్తున్న సమయంలోనే గ్రెనేడ్ ప్రమాదంలో మృతిచెందగా మరో కుమారుడు ఐలన్న పీపుల్స్ వార్ పార్టీకి ఉత్తర తెలంగాణరీజనల్ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో కిడ్నాప్‌నకు గురయ్యాడు. 37ఏళ్లు దాటినా ఆచూకీ లభించడం లేదు. కిడ్నాప్ కలకలం అప్పట్లో సంచలనం సృష్టించగా పలువురు రాజకీయ ప్రముఖులు ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. కాగా కుమారుడి ఆచూకీ కోసం ఎదురు చూసిన తల్లికి చివరికి నిరాశే మిగిలి మృతిచెందింది. కొమురమ్మ మృతిపట్ల పలువురు ప్రముఖులు, ప్రజలు నివాళులర్పించారు.

ఐదు రోజుల క్రితం..

ఇంట్లో నుంచి వెళ్లి శవమై తేలాడు

● పురుగుల మందు తాగి బలవన్మరణం చెందిన గొర్రెల కాపరి


రాజయ్య(ఫైల్)

గొల్లపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన జక్కుల రాజయ్య(50) అనే గొర్రెల కాపరి గత ఆదివారం ఇంట్లో నుంచి వెళ్లి ఐదురోజుల అనంతరం గ్రామరెవెన్యూ పరిధిలోని చింతామణి కుంట సమీపంలో గురువారం శవమై తేలాడు. దీంతో బాధిత కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజయ్య గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఆదివారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బయటికి వెళ్లిన వ్యక్తి రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టు పక్కల అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే, గతంలో ఒకట్రెండు సార్లు ఇలాగే ఇంట్లో ఎవరికీ చెప్పాపెట్టకుండా వెళ్లివచ్చాడు. ఎప్పటిలాగే తిరిగి వస్తాడనుకుని అతడి రాకకోసం ఎదిరిచూస్తున్నారు. ఈ క్రమంలో గురు వారం గొర్రెల కాపరులు గొర్రెల మందను తోలుకుంటూ చింతామణి కుంట వైపు వెళ్లగా దుర్వాసన రావడంతో దగ్గరికెళ్లి చూడగా రాజయ్య మృతదేహం కనిపించింది. దీంతో వారు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి వెళ్లి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించి వివరాలు సేకరించారు. అయితే, శవం పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడాన్ని గుర్తించిన పోలీసులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానిస్తున్నారు. తన భర్త కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడని, ఆరోగ్యం నయం కాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య శంకరవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెంకటాపూర్‌లో చోరీ

● కేసు నమోదు ● కత్తులు అపహరించిన దొంగలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో రెండు దుకాణాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి గురువారం తెలిపారు. చికెన్ సెంటర్ లోని కత్తులను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని సల్వాజీ వెంకట్ స్థానికంగా చికెన్‌సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. దుకాణం తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు రూ.2వేల విలువైన నాలుగు కత్తులను ఎత్తుకెళ్లారు. అక్కడనుంచి బస్టాండు ప్రాంతంలోని ముత్యం రాజుకు చెందిన కిరాణ దుకాణంలో చోరీకి విఫలయత్నం చేశారు. దుకాణం షటరును పైకి ఎత్తేందుకు ప్రయత్నించారు. శబ్ధం వినిపించడంతో దుకాణం వెనుకాల కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న రాజు మేల్కొని కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. బాధితుడు సల్వాజీ వెంకట్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

పత్తి రైతుల కోసం కపాస్ కిసాన్

● కొనుగోళ్ల కోసం ప్రత్యేక యాప్ ● ఏర్పాటు చేసిన సీసీఐ



చొప్పదండి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల కోసం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కపాస్ కిసాన్ అనే ప్రత్యేక యాప్‌ను తీసుకు వచ్చింది. ఇకపై సీసీఐ పత్తి కొనుగోళ్లను యాప్ ద్వారానే చేపట్టనుంది. గత సోమవారం నుంచి రైతులకు యాప్ అందుబాటులోకి రాగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి మాత్రమే సీసీఐ పత్తి కొనుగోళ్లు చేస్తున్నది. సెప్టెంబరు 30లోగా కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. రైతు రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే పత్తిని సీసీఐకి విక్రయించే అవకాశం ఉంటుంది. తద్వారా రైతుకు మద్దతు ధర లభిస్తుంది. దేశవ్యాప్తంగా సీసీఐ యాప్ ద్వారానే



పత్తి కొనుగోలు చేసేందుకు 2025-26 సంవత్సరానికి సంబంధించి యాప్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. పత్తికి కనీస మద్దతు ధర క్వింటాలుకు 8,110 రూపాయలు ప్రకటించగా మద్దతు ధర పొందాలంటే రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

30 లోగా నమోదు చేసుకోవాలి...

పత్తి సాగు చేసిన రైతులు ఈ నెల 30 లోగా కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలి. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకంతోపాటు పత్తి సాగు చేసిన భూమి సర్వే నంబర్, ఆధార్ నంబర్‌తోపాటు ఇతర వివరాలను అందులో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రెవెన్యూ అధికారుల నుంచి పత్తి పంట ధ్రువీకరణ పత్రం, గ్రామం, మండలం, జిల్లా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. సాగు చేసిన విస్తీర్ణంతోపాటు ఇతర వివరాలను నమోదు చేయగానే సీసీఐకి వివరాలు చేరిపోతాయి.

ఎక్కడ ఎంత విస్తీర్ణం సాగుచేశారనే గణాంకాలు సీసీఐకి తెలిసి పోతాయి. వీటి ఆధారంగా సీసీఐ పత్తి కొనుగోళ్లను చేపడుతుంది. రైతులకు కనీస మద్దతు ధర అందుతుంది.

స్లాట్ బుకింగ్‌తో కొనుగోళ్లు...

కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు ఎంచుకున్న మార్కెట్ యార్డుకు సంబంధించి పత్తిని విక్రయించేందుకు రైతులు ముందుగానే స్లాట్ బుక్ చేసుకోవాలి. ఏ రోజున సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించాలో వివరాలను యాప్‌లో రైతుకు సమాచారం అందుతుంది. స్లాట్ బుక్ అయిన రోజు మాత్రమే రైతులు పత్తిని విక్రయించాల్సి ఉంటుంది.

రైతులు రోజుల తరబడి సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తిరగాల్సిన పనిలేకుండా స్లాట్ బుకింగ్‌తో సూచించిన రోజునే విక్రయించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా దళారులకు చెక్ పెట్టే అవకాశం ఏర్పడుతుందని, రైతులకు మద్దతు ధర దొరుకుతుందని అధికారులు చెబుతున్నారు. వచ్చే నెల పత్తి పంట చేతికి అవకాశం ఉండగా రైతులు ఈ నెలాఖరులోగానే కపాస్ కిసాన్ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీల సీజ్

ముత్తారం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం మీదుగా అక్రమంగా మట్టిని తరలిస్తున్నలారీలను అధికారులు గురువారం సీజ్‌చేశారు. నేషనల్ హైవేరోడ్డు పనులకు కావలసిన మట్టిని అనుమతులు లేకుండా 15రోజులుగా తరలిస్తున్నారు. స్థానికులకు అనుమానం వచ్చి అనుమతులు ఉన్నాయాఅని అడగగా సూపర్‌వైజర్లు బెదిరింపులకు గురిచేశారు. స్థానికులు మైనింగ్‌శాఖ అధికారులకు ఫిర్యాదుచేయగా గురువారం అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీలను పట్టుకొని ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పారుపల్లి గ్రామం పక్కన ఉన్న గుట్టనుంచి అనుమతులు లేకుండా తవ్వకాలుజరిపిమట్టిని తరలిస్తున్నారు. మైనింగ్ అధికారులు 3లారీలనుపట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాటిని సీజ్ చేశారు.

నేడు కరీంనగర్‌లో ట్రాఫిక్ మళ్లింపు

● నిబంధనలు పాటించి సహకరించాలి
● పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గణేష్ నిమజ్జనం సందర్భంగా శుక్రవారం కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పోలీస్ కమిషనర్ గౌస్‌ఆలం ప్రకటించారు. ప్రజలు. వాహనదారులు ఈ మళ్లింపులకు సహకరించి ప్రయాణ సౌలభ్యాన్ని పాటించాల్సిందిగా కోరారు.

● మానకొండూర్ నుంచి..

- హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలు మానకొండూర్ పల్లె బస్టాండ్‌వద్ద నుంచి ముంజంపల్లి, పోరండ్ల వైపు మళ్లిస్తారు. ఆ తర్వాత తిమ్మాపూర్ వద్ద రాజీవ్ రోడ్డుకు చేరుకుని, అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లవచ్చు.
- నిమజ్జనం తర్వాత తిరిగి వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో అంటే ముంజంపల్లి, పోరండ్ల మీదుగా తిమ్మాపూర్‌కు చేరుకుని, అక్కడి నుంచి కరీంనగర్‌కు వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి మళ్లింపులు ఉండవు. అవి యథావిధిగా తమ మార్గంలో ప్రయాణించవచ్చు.

● కొత్తపల్లి నుంచి..

- జగిత్యాల నుంచి కరీంనగర్ వైపు వచ్చే వాహనాలను వెలిచాల ఎక్స్ రోడ్డు వద్ద మల్కాపూర్, చింతకుంట, పద్మనగర్ ఎక్స్ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం మీదుగా సిరిసిల్ల బైపాస్ రోడ్డు నుంచి కరీంనగర్ పట్టణానికి మళ్లిస్తారు.
- కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలకు అవసరమైనప్పుడు రేకుర్తి జంక్షన్ వద్ద యూనివర్సిటీ ఎక్స్‌రోడ్డు, మల్కాపూర్ వైపు మళ్లించి, వెలిచల ఎక్స్ రోడ్డు వద్ద జగిత్యాల రోడ్డుకు చేరుకుంటారు.

● నిమజ్జనం పాయింట్ల వద్ద..

- చింతకుంట, కొత్తపల్లిలలో నిమజ్జనం తర్వాత, ఈ పాయింట్ల వద్దకు వచ్చిన వాహనాలు యూటర్న్ తీసుకుని అదే మార్గంలో కరీంనగర్‌కు తిరిగి వెళ్లాలి.

సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 6వ తేదీ వరకు గ్రానైట్, ఇతర భారీ సరుకు రవాణా వాహనాలను ఈ మార్గాలలో అనుమతించరు. ఈ నిబంధనలను తప్పక పాటించాలని

వృద్ధురాలి పోషణను పట్టించుకోని కుమారుడు

● ఇల్లు విడిచి వెళ్లిన తల్లి
● సఖి కార్యాలయానికి తరలించిన అధికారులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలైన తల్లి పోషణను కుమారుడు పట్టించుకోకపోవడంతో ఆమె ఇంటిని వదిలి బయటకువెళ్లింది. వినాయక మండపాలవద్ద తింటూ చెట్లకింద సేదతీరుతున్న వృద్ధురాలిని గురువారం స్థానికులు గమనించి జిల్లా సంక్షేమాధికారికి బోనగిరి నరేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఫీల్డ్‌రెస్పాన్స్ అధికారి కొండయ్యను పంపించి జిల్లా కేంద్రంలోని సఖి కార్యాలయానికి వృద్ధురాలిని పంపించారు. బాధితురాలి కథనం ప్రకారం.. జగిత్యాల మండలం ధరూర్ గ్రామానికి చెందిన నాకుమల్ల కిష్టమ్మ అనే వృద్ధురాలు తనకున్న ఇంటిని తనకుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేసింది. కొన్ని రోజులుగా కొడుకు, కోడలు సరిగా చూసుకోకపోవడంతో ఆరురోజుల క్రితం ఇంటిని వదిలివచ్చింది. వృద్ధురాలు జగిత్యాల విద్యానగర్‌లో ఉన్న రామాలయం వద్ద గణపతి మండలం వద్ద తింటు అక్కడే ఉండడంతో గమనించిన స్థానికులు జిల్లా సంక్షేమాధికారికి సమాచారం అందించారు. తన కుమారుడు, కోడలు తనను తిట్టికొట్టి ఇంట్లోనుంచి వెళ్లగొట్టారని, ఎలాగైనా తన పోషణ బాధ్యత కొడుకు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమాధికారికి ఇచ్చినఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోల్‌సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్ వంకబెండ సమీపంలోని ఒకఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై గురువారంవన్‌టౌన్ పోలీసులు దాడి చేశారు. 7గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.11,840నగదు, ఏడు సెల్‌ఫోన్లను సీజ్‌చేశారు.

బావిలో పడి వృద్ధురాలు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో ఓ వృద్ధురాలు బావిలో పడి మృతిచెందింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఇందిరానగర్‌కు చెందిన అలువల లచ్చమ్మ (80)కు మతిస్థిమితం సరిగాలేదు. గురువారం ఇంట్లో నుంచి వెళ్లిన ఆమే బతుకమ్మకుంటవద్ద గల బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎల్‌ఎండీ పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

● బాధితురాలికి రూ.ఐదు లక్షలు పరిహారం చెల్లింపునకు లీగల్ సెల్ అథారిటీకి సిఫారసు

ఓదెల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు శీలారపు రమేష్‌కు గురువారం యావజ్జీవ శిక్షతోపాటు రూ.21వేలు జరిమానా విధిస్తూ పెద్దపల్లికోర్టు జడ్జి కె సునీత తీర్పునిచ్చారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిర్యాదుదారుడి మనుమరాలుమూడేళ్లక్రితం వేసవిసెలవుల్లో తాత ఇంటికి వచ్చింది. అమ్మమ్మ,తాత ఉపాధి హామీ పనికి వెళ్లగా పక్కఇంటి పిల్లలతో ఆడుకుంటోంది. ఇంటిసమీపంలో ఉన్న శీలారపు రమేష్ బాలికను అన్నం తినమని అతడి ఇంటిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడి పరారయ్యాడు. తీవ్రరక్తస్రావం అవుతున్న బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చిన అమ్మమ్మ, తాతకు జరిగినవిషయం చెప్పింది. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేశారు. ఏసీపీ సారంగపాణి కేసును పరిశీలించి మహిళా ఎస్‌ఐ మౌనికతో బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేయించారు. అనంతరం నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్లపాటు పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేకకోర్టులో విచారణ కొనసాగింది. వాదోపవాదాలు విన్న అనంతరం రమేష్‌పై నేరం రుజువుకావడంతో జడ్జి కె సునీత ముద్దాయికి యావజీవ కఠినకారాగార శిక్షతోపాటు రూ.21వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.5 లక్షలు పరిహారంగాచెల్లించాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీకి సిఫారసుచేశారు. కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేష్ కీలకపాత్ర వహించారు. డీసీపీ కరుణాకర్, ఏసీపిగజ్జికృష్ణ పర్యవేక్షణలో సాక్ష్యులను ప్రవేశపెట్టి, నిందితుడికి శిక్షపడేలాకృషి చేసిన సీఐసుబ్బారెడ్డి, ఎస్సై దీకొండరమేష్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్‌ప్రాసిక్యూషన్ బృందాన్ని రామగుండం సీపీ అభినందించారు.

ఎదురెదురుగా ఢీకొన్న కారు, ట్రాక్టర్

● కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

శంకరపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు.. ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డ సంఘటన శంకరపట్నం మండలం కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి దేవాలయ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా గోపాలపూర్ గ్రామానికి చెందిన తీగల రాజేందర్, తీగల శ్రీనివాస్ కారులో కరీంనగర్ నుంచి హనుమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో హుజూరాబాద్ వైపు నుంచి కేశవపట్నం వైపు వస్తున్న ట్రాక్టర్ కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై కొత్తగట్టు శివారులో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసమైంది. కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులోని వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు108లో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయంతెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని ప్రమాదానికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

ఇసుక డంపుల స్వాధీనం


పట్టుకున్న ఇసుకను లారీలో తరలిస్తున్న అధికారులు

కథలాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని బొమ్మెన పెద్దవాగు శివారులో అక్రమంగా నిల్వఉంచిన ఇసుకడంపులను గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొందరు వ్యక్తులు కొద్దిరోజులుగా ఆ ప్రాంతంలో ఇసుకను నిల్వచేసి టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్నారని అధికారులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. 32ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకుని సూరమ్మచెరువు కాంట్రాక్టర్‌కు వేలంద్వారా విక్రయించామని ఎస్సై నవీన్‌కుమార్, ఆర్‌ఐనగేశ్ తెలిపారు. తక్కళ్లపల్లి వాగు పరిసరాల్లో నిల్వ ఉంచిన 12ట్రిప్పుల ఇసుకనుకూడా వేలంవేసి విక్రయించినట్టు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి చెరువులో వ్యక్తి గల్లంతు


అనిల్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన దబ్బెట అనిల్(31) బంధువుల అంత్యక్రియలకు వెళ్లి స్థానిక గిద్ద చెరువులో స్నానం చేస్తూ గల్లంతైన ఘటన గురువారం చోటు చేసుకుంది. దబ్బెట రాధ ఇటీవల కరీంనగర్‌లో రోడ్డుప్రమాదంలో మృతి చెందింది. కుటుంబసభ్యులు స్వగ్రామమైన పందిల్లలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం చెరువులో స్నానం చేస్తున్న క్రమంలో అనిల్ గల్లంతయ్యాడు. తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆధ్వ ర్యంలో జాలర్లు చెరువులో పడవల ద్వారా గాలింపు చేపట్టారు. చీకటి కావడంతో గాలింపును నిలిపివేశారు. అనిల్‌కు భార్య ఉమా, కూతుళ్లు అన్విత, వినూత్న, తండ్రి రాజయ్య ఉన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం


ధ్వంసమైన మొక్కజొన్న పంట

కథలాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్ర్యాలలో బుధవారం రాత్రి అడవిపందులు దాడి చేయడంతో సుమారు ఐదెకరాల మొక్కజొన్న పంట ధ్వంసమైంది. నాలుగు నెలలు పంటను కాపాడుకుని చేతికొచ్చే దశలో ఉండగా అడవి పందులు పంటను నాశనం చేశాయని బాధితరైతులు మిట్టపల్లి గంగారెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరికొద్ది రోజుల్లో పంటను కోసుకునేందుకు సిద్ధమవుతుండగా పందుల వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

బాబోయ్ కుక్కలు

● చిన్నారులు, వృద్ధులపై దాడులు


రాయికల్‌లో తిరుగుతున్న వీధి కుక్కలు

రాయికల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మున్సిపాలిటీలో కుక్కల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయి. పట్టణంలో 12వార్డులు ఉండగా, సుమారు వెయ్యికుక్కల వరకు తిరుగుతున్నాయి. ఎక్కడ చూసినా గుంపుగుంపులుగా కుక్కలు ఉండటంతో చిన్నారులు ఆరుబయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. బల్దియాలో కుక్కలను నియంత్రించేవారు లేరు. పశు వైద్యాధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని కుక్కలు అంతుచిక్కని రోగంతో కనిపిస్తున్నాయి. కొన్ని కుక్కలు చర్మం ఊడిపోయి గజ్జి సోకినట్లు ఉంటున్నాయి. ఈ కుక్కలు ఎవరినైనా కరిస్తే తీవ్ర దుష్పరిణామాలు ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని, పశు వైద్యాధికారులు కుక్కలకు వ్యాక్సినేషన్ చేయాలని కోరుతున్నారు.

● పట్టణాల్లో పెరుగుతున్న కేసులు

గ్రామాలతో పోల్చుకుంటే 80శాతం కేసులు పట్టణంలోనే నమోదవుతున్నాయి. యానిమల్‌బర్త్ కంట్రోల్, జంతుసంరక్షణ బోర్డుఆఫ్‌ఇండియా నిబంధనల ప్రకారం వీధి కుక్కల సంఖ్య అదుపునకు శస్త్ర చికిత్సలు చేయాలన్నారు

● కుక్కలు దాడి చేస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు

✔ కుక్కలు కరిచిన ప్రదేశంలో మంచి నీరు, సబ్బుతో ఐదు నిమిషాలు పరిశుభ్రంగా కడగాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

✔ స్వల్పగాయాలకు (గీతలకు) మూడు డోసుల వ్యాక్సిన్ తీసుకోవాలి.

✔ రక్తస్రావమైన గాయాలకు నాలుగు డోస్‌ల వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి.

✔ కుక్కలు కరిచిన రోజు మొదటి డోస్, 3వ రోజు రెండో డోస్, 7వరోజు మూడోడోస్, 21వ రోజు నాలుడోడోస్ తీసుకోవాల్సి ఉంటుంది.

✔ తల భాగంలో ఎలాంటి జంతువులు గాయపరిచినా నాలుగు డోస్‌ల వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి.

✔ యాంటీరేబిస్ వ్యాక్సిన్ చేయించుకుని తగిన చికిత్స పొందాలి. ఆలస్యం, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు వస్తుంది.

✔ ప్రధానంగా ఇళ్లలోని పెంపుడుకుక్కలకు వ్యాక్సిన్ క్రమం తప్పకుండా వేయించాలి.

● నియంత్రణ చర్యలు తీసుకుంటాం..

మనోహర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్



నీళ్లు, ఆహారం దొరకక వీధి కుక్కలు దాడిగి దిగుతుంటాయి. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించి సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటాం. కుక్కల దాడిపై ఉన్నతాధికారులకు నివేదించి వాటి బెడద తగ్గించేందుకు కృషి చేస్తాం.

గుంతలమయంగా లో లెవల్ వంతెన

● ఇబ్బందుల్లో వాహనదారులు ● పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


బురదమయంగా మారిన లోలెవల్ వంతెన

సైదాపూర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్-హుజూరాబాద్ ప్రధానరహదారిలో సైదాపూర్ సమీపంలో గల లో లెవల్ వంతెన పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ప్రయాణం చేసేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒకవైపు పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అందులో బురద పేరుకపోవడంతో వాహనాలు ఒకవైపు నుంచే వెళ్తున్నాయి. ఒక వైపు నుంచి వాహనాలు వెళ్లేవరకు ఇంకోవైపు వాహనాలు అక్కడే నిలపాల్సి వస్తోంది. గుంతల్లో టైర్లు పడి ఇబ్బంది అవుతోందని వాహనదారులు గుంతలున్న వైపు వెళ్లడం లేదు. ఇది ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. వర్షాలు ఎక్కువగా పడితే న్యాల చెరువు మత్తడి పడి రోడ్డుపై నుంచి నీరు ప్రవహించే అవకాశముంది. వర్షాలు ఎక్కువగా కురిసిన ప్రతీసారీ లోలెవల్ వంతెనలో నీరు పట్టక రోడ్డుపై నుంచి నీరు ప్రవహించి మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చాలా సంవత్సరాలుగా ఈ లోలెవల్ వంతెనను తొలగించి హైలెవల్ వంతెన నిర్మాంచాలనే డిమాండ్ ఉంది. చాలాసార్లు అప్పటి ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు, ఇప్పటి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్థానిక ప్రజలు విన్నవించారు. అయినా ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మించలేదు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సైదాపూర్ వద్ద గుంతలమయంగా మారిన లోలెవల్ వంతెన

ఉమ్మడిజిల్లా జూనియర్‌కళాశాలల ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా గుమ్మడి మధుజాన్సన్



మధు జాన్సన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లా జూనియర్ కళాశాలల క్రీడాసమాఖ్య(ఎస్‌జీఎఫ్) కార్యదర్శి గుమ్మడి మధుజాన్సన్ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్అండ్‌కామర్స్ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధుజాన్సన్ 2025-26 సంవత్సరానికి క్రీడాసమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి గంగాధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మధుజాన్సన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, వి ఆంజనేయరావు, వెంకటరమణాచారి, శశిధర్ శర్మ, ఎ నిర్మల, సుధాకర్, బల్బీర్‌సింగ్, కళాశాల అధ్యాపక బృందం, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి, ఒలంపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

ప్రమాదకరంగా ఫైవింక్లయిన్ బస్‌షెల్టర్



శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న బస్‌షెల్టర్ పోల్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలసంఖ్యలో ప్రయాణికులు వేచిచూసే గోదావరిఖని ఫైవింక్లయిన్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ కూలిపోయే దశకు చేరుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సింగరేణి ఆధ్వర్యంలో ఫైవింక్లయిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బస్‌షల్టర్‌లోని ఐరన్ పోల్స్ శిథిలమై విరిగిపోయే దశకు చేరుకున్నాయి. యాచకులకు నిలయంగా మారిన ఈ బస్‌షల్టర్‌ను ఇటీవల ఆంధ్రజ్యోతి కథనంతో కార్పొరేషన్ సిబ్బంది శుభ్రం చేశారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడం, వర్షాకాలం కావడంతో ప్రయాణికులు బస్సుల కోసం బస్‌షల్టర్ వేచి చూస్తుంటారు. ఐరన్‌పోల్స్ ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు ప్రాణలు అరచేతిలో పెట్టుకుని బస్సుల కోసం వేచిచూస్తున్నారు. అధికారులు నూతన బస్‌షెల్టర్‌ను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇసుక లారీల పట్టివేత

గన్నేరువరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను గురువారం గుండ్లపల్లి స్టేజివద్ద పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.





హై లెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యేదెన్నడో?

- రెండేళ్లుగా శిలాఫలకాలకే పరిమితం
- వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలంలో హైలెవల్ వంతెనల నిర్మాణాలకు శిలాఫలకాలు వేసి రెండేళ్ల గడుస్తున్నా పనులు ప్రారభం కావడం లేదు. దీంతో వర్షాకాలంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. ఇబ్రహీంపట్నం నుంచి జిల్లా సరిహద్దు అయిన వర్షకొండ గ్రామం గుండా నిజామాబాదు జిల్లాకు వెళ్లే రహదారిపై రెండు లోలెవల్ వంతెనలు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే వర్షపు నీరు వీటిపై నుంచి ప్రవహించి రాకపోకలు అంతరాయం ఏర్పడుతోంది. ఈ రెండు వంతెనల నిర్మాణానికి అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు 2023లో రూ.4 కోట్లు మంజూరు చేయించి భూమి పూజ చేశారు. గుత్తేదారులు పనులు దక్కించుకొని వంతెన నిర్మాణానికి పక్కన అప్రోచ్ రోడ్డు కోసం పైపులు తెప్పించి వదిలేశారు. ప్రభుత్వాలు మారడంతో వంతెన నిర్మాణానికి నాయకులు, అధికారులు చొరవ చూపడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలు పడినప్పుడు వర్షకొండ పెద్ద చెరువు మత్తడి దూకి లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహించి రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. దీంతో మండల కేంద్రానికి రావడానికి ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి వంతెనల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎం.డీ ఫయిజాన్: ఏఈ, రోడ్లు భవనాల శాఖ

వర్షకొండ, ఇబ్రహీంపట్నం మధ్య గల రెండు వంతెనల నిర్మాణం కోసం పనులు దక్కించుకున్న గుత్తేదారులతో మాట్లాడి పనులు ప్రారంభయ్యేలా చూస్తాం.

పీహెచ్‌డీ గైడ్‌షిప్ కోసం ఎస్సారార్ అధ్యాపకుల దరఖాస్తు



ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు పీహెచ్‌డీ గైడ్ షిప్ కోసం దరఖాస్తులను సమర్పిస్తున్న ఎస్సారార్ అధ్యాపకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ అటానమస్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది అధ్యాపకులు పీహెచ్‌డీ గైడ్‌షిప్ కోసం శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్‌కు దర ఖాస్తు సమర్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్యకల్వకుంట రామకృష్ణ తెలిపారు. కళాశాల తెలుగు విభాగం నుంచి ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, కామర్స్ విభాగం నుంచి డాక్టర్ ఎం మల్లారెడ్డి, డాక్టర్ హర్‌జ్యోత్‌కౌర్, డాక్టర్ బూర్ల నరేష్, డాక్టర్ కెఅర్జున్, వృక్షశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ తిరు కోవెల శ్రీనివాస్, డాక్టర్ పడాల తిరుపతి వెరసి ఎనిమిది మంది అధ్యాపకుల దరఖాస్తులను యూనివర్సిటీకి సమర్పించినట్లు తెలిపారు. ఇటీవలే శాతవాహన యూనివర్సిటీ వారు కళాశాలలోని తెలుగు, కామర్స్, వృక్షశాస్త్ర విభాగాలను రీసెర్చ్‌సెంటర్లుగా గుర్తింపు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పారక్, టి రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, పరిశోధన కమిటీ సమన్వయకర్త డాక్టర్ ఎం మల్లారెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి (52) అనే వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలప్రకారం మహేందర్‌రెడ్డి ఎన్‌టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. వారంరోజుల నుంచి అధి కంగా మద్యం సేవిస్తున్నాడని గురువారం ఉదయం అందుగులపల్లి రైల్వేగేట్ వద్ద గూడ్సు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పి కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరదనీరు రావడం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 23 గేట్లు పైకి ఎత్తి 1,00,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 76.104 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయనికి (మిడ్‌మానేరు) ప్రాజెక్టు ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ప్రాజెక్టులోకి గురువారం 15300క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా, ఇందులో ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ ద్వారా 14000క్యూసెక్కులు మానేరు, ములవాగు ద్వారా 1300క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టునుంచి దిగువఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు ఒకగేట్‌ద్వారా వెయ్యి క్యూసెక్కులు, ప్యాకేజి10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 12800 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 317.44 ఉండగా, నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.118 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.75 టీఎంసీల నీరు ఉంది. సర్జిపూల్ ద్వారా నాలుగు పంపులతో 12800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయక సాగర్‌కు 9900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్ : కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయకాలువ ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. మిడ్‌మానేరు నుంచి 1000 క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ ద్వారా 1400 క్యూసెక్కులు మొత్తం 2400క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3వేల క్యూసెక్కులు దిగువకు, మిషన్ భగీరథ, ఆవిరిరూపంలో 305క్యూసెక్కులు మొత్తం 3305 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది. ఎల్ఎండిలో ప్రస్తుతం 22.707టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



కాకతీయ కాలువ ద్వారా దిగువకు వెలుతున్న నీరు

కొత్తపల్లి-హుస్నాబాద్ రహదారి నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్తపల్లి-హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి నిర్మాణం వేగవంతం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు వరుసల రహదారి కోసం ఇప్పటికే మార్కింగ్ పూర్తయినందున ఎలక్ట్రికల్ వర్క్స్, బావుల పూడ్చివేత, చెట్లు కత్తిరించడం వంటి పనులు వేగవంతంగా చేయాలన్నారు. ఇప్పుడున్న రహదారిని వెడల్పు చేస్తున్నందున గ్రామాల గుండా వెళ్తున్న రహదారి నిర్మాణం కోసం గ్రామసభలు ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని అన్నారు. అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించడం, కొత్తలైన్ ఏర్పాటు వంటిపనులను వేగవంతంగా చేయాలని అన్నారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు నిర్మంచనున్న ఈ రోడ్డు కోసం కరీంనగర్ జిల్లా పరిధిలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి, తదితర గ్రామాల పరిధిలో రోడ్లను ఆనుకొని ఉన్న బావులను పూడ్చివేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, జిల్లా అటవీశాఖఅధికారి బాలామణి, ఆర్అండ్‌బి ఈఈ నరసింహాచారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులపై చర్యలు తీసుకోవాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి గిరిజన సంఘాల వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు గిరిజన సంఘాల నాయకులు గురువారం వినతి పత్రం అందించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని మాట్లాడిన సోయం బాపూరావు, తెల్లం వెంకట్రావులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూక్య తిరుపతి నాయక్, గుగులోతు తిరుపతి నాయక్, రాజునాయక్, రవినాయక్, సదానందం, లక్పతినాయక్, మురావత్ సంతోష్, రాజన్‌నాయక్, లాకావత్‌రవి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన నవోదయ విద్యార్థులు



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులు

చొప్పదండి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు నవోదయ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఒంగోల్‌లో జరిగిన రీజనల్‌స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. పదవతరగతి విద్యార్థి వంశీ, తొమ్మిదవ తరగతి విద్యార్థి కార్తి కేయ ఇండిజెనియస్ టాయ్స్‌మేకింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయి పోటీలు ఢిల్లీలో జరగనుండగా ఆర్ట్ టీచర్ గోక నాగేశ్వర్‌రావు, విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

లింగన్నపేటలో దొంగతనం

గంభీరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్న పేట గ్రామంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. ఎల్లం అనేవ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. 2గ్రాముల బంగారం, 10వేల నగదుతోపాటు గల్ఫ్ కరెన్సీని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇంటికి తాళం వేసి, పక్కనేఉన్న ఇంట్లో ఎల్లం కుటుంబీకులు నిద్రించారు. దీంతో ఇంటి తాళాన్ని పగులగొట్టి దొంగతానికి పాల్పడ్డారు.

శిథిలావస్థలో ప్రభుత్వ పాఠశాల



చీమలపేట గ్రామంలో శిథిలమైన ప్రభుత్వ పాఠశాల

జూలపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేటలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆ పాఠశాలలో చదువుకునే 45 మంది విద్యార్థులు భయం భయంగా చదువు కొనసాగిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పైకప్పు పెచ్చులు రాలి పోవడమే కాకుండా పైకప్పు కొంత భాగం కూలిపోయి ప్రమాదకరంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పాఠశాల సమీప ఇంటిఆవరణలో అరకొర వసతులతో విద్యార్థులు చదువులను వెళ్లదీస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలకు మరమ్మతు చేయడానికి రూ.9లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఉన్నతాధికారులు విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు పక్కాభవనం నిర్మించి విద్యార్థులకు అన్ని వసతులను కల్పించాలని గ్రామస్థులు కోరు తున్నారు.

ధర్మపురిలో ముగిసిన భాగవత సప్తాహం

ధర్మపురి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భాద్రపద మాసం పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలోని శ్రీలక్ష్మీ గణేష్ రైస్‌మిల్‌లో పురాణ ప్రవచకులు ఇనుగంటి రామ్మోహన్‌రావు గారి భాగవత సప్తాహం కార్యక్రమం గురువారం ముగిసింది. ఎనిమిదిరోజుల నుంచి రామ్మోహన్‌రావు శ్రీ కృష్ణుని చరిత, శ్రీ కృష్ణుని లీలలు, ప్రహ్లాద చరిత్ర, ధృవుని చరిత్ర, వామన చరిత్ర, భక్తుల చరిత్ర గురించి నిత్యం గంటల తరబడి ప్రవచనాలు చేశారు. వందలాది మంది ఎంతో ఓపికతో, భక్తిశ్రద్ధలతో విని శ్రవణానందం పొందారు. ముగింపు రోజున ప్రవచనాలు చేసిన ఇనుగంటి రామ్మోహన్‌రావు దంపతులను ఆలయ మాజీధర్మకర్త ఇనుగంటి రమాదేవి-వేంకటేశ్వర్‌రావు దంపతులు ఘనంగా సన్మానించి, నగదు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ ట్రేడర్స్ ఇనుగంటి వినోద్‌రావు, ఇనుగంటి వేంకటేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సత్రం కోశాధికారి రంగ శంకరయ్య, గునిశెట్టి మల్లేశం, భీమనాతి అశోక్, గునిశెట్టి రవీందర్, అక్కెనపెల్లి మురళీధర్, ఉత్తూరి సత్తయ్య, బొల్లం హరిప్రసాద్, నాగేశ్వర్‌రావు, కొండ వినయ్ కుమార్, రంగ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.4 కోట్లతో పరారైన దంపతుల పట్టివేత

- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో గుగ్గిళ్ల రమేష్-గాయత్రి దంపతులు రూ.1.40కోట్లతో నాలుగు నెలల క్రితం ఉడాయించగా బుధవారం బాధితులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ప్రైవేట్‌ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న రమేష్ గ్రామంలో చిట్టీలతోపాటు ఫైనాన్స్ నడుపుతుండేవాడని బాధితులు తెలిపారు. చిట్టీ అవసరం లేని వారిని గుర్తించి వారికి వచ్చే డబ్బులను తమ వద్దనే ఉంచుకొని వడ్డీ ఇస్తామని చెప్పేవారు. అదేవిధంగా గ్రామంలో కొంతమంది వద్ద పెద్దమొత్తంలో అప్పు తీసుకున్నట్లు తెలిసింది. డబ్బులు తిరిగే చెల్లించలేక నాలుగునెలల క్రితం రమేష్-గాయత్రి దంపతులు గ్రామం నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు వీరికోసం వెతుకుతుండగా బుధవారం సాయంత్ర కోరుట్ల కోర్టు వద్ద రమేష్ కనిపించాడు.

బాధితులు రమేష్‌ను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. కొంతమంది బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. కాగా రమేష్-గాయత్రి దంప తులు ఇప్పటికే కోర్టు నుంచి బాధితులకు నోటీసులు పంపినట్లుగా తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా పలువురి ఎంపిక



డాక్టర్ కోడూరి శ్రీవాణిని అభినందిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్



డాక్టర్ కె అర్జున్

గణేశ్‌నగర్/ఎలిగేడు/పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగం అధిపతిగా, విశ్వవిద్యాలయ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కోడూరి శ్రీవాణి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా కే.అర్జున్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం హైదరాబాదులోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకోనున్నారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన శ్రీవాణి శాతవాహన విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో సీనియర్ సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే పరిశోధనా రంగంలో అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్నారు. ఈ సంద ర్భంగా కోడూరి శ్రీవాణిని ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్ అభినందించారు.

పెద్దపల్లి జిల్లా నిమ్మనపల్లికి చెందిన అర్జున్ 12 సంవత్సరాలుగా కామర్స్ బోధనతో పాటు 12 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధనన పత్రాలను ప్రచురించారు. ఈ సందర్భంగా అర్జున్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. రామకృష్ణ, టీజీసీజీటీఏ. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పారక్ అధ్యాపకులు అభినందించారు.

జగిత్యాల నుంచి..

జగిత్యాల: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో రసాయన శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ నీలి వాసవి, ఎస్కేఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న జంతు శాస్త్ర లెక్చరర్ పార్లపల్లి రాజు ఎంపికయ్యారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు జాబితాలో నీలివాసవి, రాజుకు అవ కాశం దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరుగనున్న కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కాగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయిన డాక్టర్ నీలి వాసవిని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, చరిత్ర లెక్చరర్ సాసాల మల్లికార్జున్, ఇంగ్లీష్ లెక్చరర్ జ్యోష్ణ, తెలుగు లెక్చరర్ డాక్టర్ జి శ్రీలత తదితరులు అభినందనలు తెలిపారు.



డాక్టర్ నీలి వాసవి



పార్లపల్లి రాజు

ఉత్తమ లైబ్రేరియన్‌గా శంకరయ్య

కోల్‌సిటీటౌన్ : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుల అవార్డుకు గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ పల్లె శంకరయ్య ఎంపికయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చల్లగరిగ గ్రామానికి చెందిన శంకరయ్య 2002లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌లో గెజిటెడ్ లైబ్రేరియన్‌గా నియమితులయ్యారు. 2024లో గోదావరిఖనికి బదిలీపై వచ్చారు. 32ఏళ్లుగా విద్యారంగంలో సేవలు అందిస్తున్న శంకరయ్య, ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారిగా 18ఏళ్లు పనిచేశారు. శంకరయ్యకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంపై గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసింది.

వినాయక మండపాల వద్ద

కుంకుమ పూజలు, అన్నదానాలు..




ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంటలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు




గంభీరావుపేట, రుద్రంగిలో 108 రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు..

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్లు సబేరాబేగం, రాములునాయక్, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్లు కృష్ణహరి, మల్లేశం, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయకుడిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయా యువజన, కుల సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలలో కుంకుమపూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. ఇల్లంతకుంటలోని గ్రీన్‌హౌజ్ కాలనీ, గంగాధర ఆలయంలో గురువారం మహిళలు సామూహిక కుంకుమపూజలో పాల్గొన్నారు. రైజింగ్‌స్టార్ యువజన సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. వినాయక మండపాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు మూగు నాగరాజుశర్మ, రాజేశ్వరశర్మ, నాగలింగం, నర్సయ్యలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథు డికి గురువారం 108 రకాల ప్రసాదాలను సమర్పించారు. శ్రీ అచ్చయ్య స్వామి ఆలయంలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయకుడిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి సుదాకర్‌శర్మపంతులు ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు మంగళహార తులు ఇచ్చి, దర్శించుకున్నారు. కాగా గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో నెలకొల్పిన మట్టి వినాయకుడిని గురువారం ఆనందోత్సాహలతో నిమజ్జనం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు సమీప నమాజ్ చెరువులో నిమజ్జనం చేశారు.



రుద్రంగిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

● కోనరావుపేట : వినాయక చవితి సందర్భంగా కోనరావుపేట మండలంలో కొలువుదీరిన మండపాల్లో ఆయా మండపాల నిర్వాహకులు గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకునికి నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మరికొన్ని మండపాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో మార్కండేయ దేవాలయంలో ఏర్పా టుచేసిన వినాయకుడిని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు దర్శిం చుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారయణతో పాటు ఎస్ఐ ఉపేంద్రచారి, నాయకులు బొల్లి రాంమోహన్, వైద్య శివప్రసాద్, జల్గం ప్రవీణ్, కోడి అంతయ్య, నేరెళ్ల నర్సింగంగౌడ్, తదితరులను పద్మశాలి సంఘం నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాపెల్లి ఆనందం, మోర లక్ష్మీరాజం, మోర రాజు, అంకారపు రవీందర్, సామాల రమేశ్, మచ్చ శ్రీనివాస్, మచ్చ ఆంజనే యులు, ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, కోడం రమేశ్, బండి జగన్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండల కేంద్రంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా గురువారం రాజీవ్‌నర్‌కాలనిలో రాజీవ్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో అన్నధానం ఏర్పాటు చేశారు. హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద 108 నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'కూనంనేని' కృషి వల్లే జీవో..

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో ప్రభుత్వం భవన నిర్మాణ రంగంలోని కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10లక్షలు, సహజ మరణాలకు రూ.2లక్షల ఇవ్వడానికి జీవోను విడుదల చేసిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగం కార్మికుల కుటుంబాల కోసం జీవో తీసుకొచ్చిన ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, భవన నిర్మాణ రంగం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల పోశెట్టి, పండుగ పోచమల్లు, గుమ్మడివెల్లి మంజుల పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు సకాలంలో యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే సరిపడా ఎరువును సరఫరా చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. వీర్నపల్లి మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మారుమూల గ్రామాల్లోని రైతులకు పూర్తిస్థాయిలో యూరియాను సరఫరా చేయకపోవడం వల్ల నిత్యం దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సివస్తోందన్నారు. ఒక్కో రైతుకు ఒక బస్తాను పంపిణీ చేయడంతో సరిపోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్నదాతలకు యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ప్రశాంత్ డిమాండ్ చేశారు. నాయకులు కొమురయ్య, భూమరాజు, నర్సయ్య, నరేందర్, సురేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో బోరుబావి ఏర్పాటు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.2 లక్షల కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధులతో బోరు బావి తవ్వకానికి ఎంఈవో కృష్ణహరి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి గురువారం ప్రారంభించారు. బడిలో తాగునీటి సమస్యను తీర్చేందుకు నిధులు మంజూరు చేసిన బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బుగ్గా రెడ్డి, సత్యంరెడ్డి, నరేశ్, బాపురెడ్డి, సత్యం, శ్రీశైలం, కిరణ్‌నాయక్, రంజిత్‌కుమార్, భాస్కర్, రమేశ్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, రాకేశ్, శేఖర్, వెంకటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

చందుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మొగిలి లక్ష్మణ్, రేవోజు సదానందం సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం మూడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల శాఖ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా జావీద్, ప్రధానకార్యదర్శిగా ప్రేమ్ సాగర్‌రెడ్డి, కోశాధికారిగా సాగర్, ఆర్థిక శాఖ సభ్యులుగా రమేష్, ఉపాధ్యక్షుడిగా ఈగ శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా స్వరాజ్య లక్ష్మి, జిల్లా కార్యదర్శులుగా రమణ, నరేందర్, శ్రీనివాస్, మండల కార్యదర్శులుగా కార్తీక్, రాజ్‌కుమార్, సంజీవ్, శ్రీలతలను ఎన్నుకున్నారు.

ఫ్లెక్సీలను తొలగించాలని వినతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా కమాన్ ప్రాంతంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం చుట్టూ ఫ్లెక్సీలు కట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ రజక సంఘం మండల అధ్యక్షుడు నర్సింలు గురువారం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. కొందరు పార్టీల నాయకులు విగ్రహం చుట్టూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల చాకలి ఐలమ్మ విగ్రహం కనబడకుండా పోతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు..

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసి నెల రోజులు గడుస్తున్నా.. సకాలంలో యూరియా చల్లక పైరు ఎదగడం లేదు.. ఎరువు కోసం పనులు వదులుకుని కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్నాం.. దండం పెడుతాం.. యూరియా అందించండి.. లేదంటే దిగిపొండి.. అంటూ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని ప్యాక్స్ ఆధ్వర్యంలోని గోదాం వద్ద యూరియాకు బారులు తీరారు. ముందుగా టోకెన్లను జారీ చేస్తామని సిబ్బంది పేర్కొన్నారు. దాంతో రైతులు గంటల తరబడి పడిగాపులు కాచారు. వీర్నపల్లి మండల కేంద్రంలో 220 యూరియా బస్తాలు రావడంతో తమకు పూర్తి స్థాయిలో అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా, రాస్తారోకో చేపట్టారు. గత పది రోజులుగా ఎరువు కోసం ఎదురు చూస్తున్న తమకు సరిపడవని వాపోయారు. రైతులకు పూర్తి స్థాయిలో అందించకుండా ఇబ్బందుకు గురి చేస్తోందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని శాంతింపజేయడానికి యత్నించారు. పోలీసులు, రైతులు, నాయకుల మధ్య స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ముక్తర్‌పాషా, ఏఎంసీ చైర్మన్ రాములునాయక్‌లు రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌కుమార్, శ్రీరాంనాయక్, రఫీ, శేఖర్, సంజీవ్, రాములు, రైతులు పాల్గొన్నారు.



వీర్నపల్లిలో ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

● కోనరావుపేట : యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతూ గురువారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామ శివారులో మరిమడ్ల రైతులు రైతులకు సరిపడా యూరియా అందజేయాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. యూరియా కావాల్సిన రైతులు ప్రభుత్వం స్పందించి అందజేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

విద్యాసంస్థల్లో ముందుస్తు గురు పూజోత్సవం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ముందుస్తుగా వేడుకలను నిర్వహించారు. ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్, అంబేద్కర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్ కరస్పాండెంట్ రాజ్‌కుమార్, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నాగుల రమాదేవి, ఉపాధ్యాయులు మల్లేశం, మంజుల, సత్యనారాయణ, రవికుమార్, రవీందర్, గంగాభవాణి, జ్యోతి, ఐలయ్య, భానుచందర్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జితేందర్, ఉపాధ్యాయులు బాల్ రెడ్డి, గుండబోయిన శ్రీనివాస్, లక్ష్మణ్, పావని, మహేష్, బనాజీ, ఈగ శ్రీనివాస్, మంద శ్రీనివాస్, కార్తీక్, సాగర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణపయ్య..



మ్యాజిక్ షోను ఆసక్తిగా వీక్షిస్తున్న ప్రజలు



గుడిచెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్, కలెక్టర్, ఎస్పీ

(3వ పేజీ తరువాయి)

వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. పట్టణంలోని పలు వినాయక మండపాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలో పాల్గొని డప్పుకళాకారులతో నృత్యం చేస్తూ రాజన్న ఆలయం ముందు ఒగ్గుడోలు కొడుతూ శోభాయాత్రలో సందడి చేశారు.

భారీగా తరలివచ్చిన భక్తులు..

వేములవాడ పట్టణలోని గుడి చెరువులో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనోత్సవాలను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారులు భక్తులతో సందడిగా మారిపోయాయి. గుడి చెరువులో చేసిన గణేష్ నిమజ్జనాలను వీక్షిస్తూ తమ సెల్‌ఫోన్‌లో ఫోటోలను తీస్తు సందడిగా గడిపారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జనం జరిగే స్థలాల్లో గుడి చెరువు వైపు భక్తులు వెళ్లకుండా చూట్టు తాళ్లతో భద్రత ఏర్పాట్లను చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన నిమజ్జన వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ, ఎస్పీ మహేష్ బి. గితే, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్‌లతో పాటు మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేనేజర్ సంపత్‌రెడ్డి, తహసీల్దార్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల నుంచి భారీగా గణనాథులు తరలిరావడంతో మండపాల నిర్వాహకులతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 200మంది సిబ్బందితో బందోబస్తుతో సమన్వయపరుస్తూ వినాయకులు త్వరగా వెళ్లేందుకు కృషి చేశారు.

శోభాయాత్రలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

గణేష్ నిమజ్జనోత్సవ శోభయాత్రలో బీజేపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణతో పాటుగా బీజేపి నాయకులు నృత్యాలు చేశారు. రాజన్న ఆలయం ముందు గణేష్‌ల వద్ద ఒగ్గుడోలు కళాకారులతో డోలు కొడుతూ సందడి చేశారు. బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఏనుగు మనోహర్‌రెడ్డితో పలు వలువురు పాల్గొని సందడిగా గడిపారు.

రాజన్న ఆలయంలో..

వేములవాడ రాజన్న ఆలయంలో ప్రతిష్టించిన గణనాథుడి నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలో పాల్గొన్న ఈవో రమాదేవి శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం రాజన్న ఆలయ ధర్మగుండంలో గణనాథుడిని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు, సూపరిండెంట్‌లు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణంలో గురువారం వినాయకులను శోభాయాత్రగా తీసుకెళ్లి మానేరు వాగులో నిమజ్జనం చేశారు. అంబినగర్‌లోని ఆదర్శయూత్ సిద్ది మండప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలను నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శ్రీకృష్ణవేణి టాలెంట్ హైస్కూల్, సూర్య రేడియంట్ హైస్కూల్, సహస్ర జూనియర్ కళాశాలలో నవరాత్రులను ముగించుకొని వినాయకుడికి వీడ్కోలు పలికి మానేరు వాగులో నిమజ్జనం చేశారు.

● ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలు గురువారం రాత్రి వైభవంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



సిరిసిల్లలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



ఎల్లారెడ్డిపేటలో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

గంగమ్మ పైపైకి..

(3వ పేజీ తరువాయి)

అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టు, రంగనాయక సాగర్‌వరకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎగువమానేరు ప్రాజెక్టు మత్తడితో సిరిసిల్ల మానేరు వాగు పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలో శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 13420 క్యూసెక్కులు కొనసాగుతోంది. సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగులతో పాటు శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువ ద్వారా వరదనీరు వస్తుంది. శ్రీరాంసాగర్ వరద కాలువ నుంచి 13220 క్యూసెక్కులు, మానేరు, మూలవాగుల నుంచి 200 క్యూసెక్కులు వస్తున్న నీటి ప్రవాహంతో మిడ్‌మానేరు ప్రాజెక్టులో 27.55 టీంఎంసీల సామర్థ్యానికి 26.042 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సిరిసిల్ల మానేరు బ్రిడ్జి వరకు మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ చేరింది. అన్నపూర్ణ ప్రాజెక్టు 12800 క్యూసెక్కులు నీటి ప్రవాహం కొనసాగుతుంది. రంగనాయక సాగర్‌కు 6600 క్యూసెక్కులు నీళ్లు వెళ్లుతున్నాయి. జిల్లాలోని 656 చెరువుల్లో 133 చెరువులు మత్తడి దూకాయి. మిగతా చెరువులు కుంటల్లోకి భారీ వరద నీరు చేరింది.194 చెరువుల్లోకి మాత్రం 25శాతం నీరు మాత్రమే చేరింది. భూగర్భ జలాలు పెరగడంతో బోరు బావులు మాత్రం నిండుగా పోస్తున్నాయి.

2.35 లక్షల ఎకరాల్లో పంటల సాగు

వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో 235330 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వరి 1,84,310 ఎకరాలు, మొక్కజొన్న 3,748 ఎకరాలు, పత్తి 46,485 ఎకరాలు, కందులు 660 ఎకరాలు, పెసర 30 ఎకరాలు, ఇతర పంటలు 137 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో సాగుకు సంబంధించి మండలాల్లో గంభీరావుపేట మండలంలో 18,598 ఎకరాల్లో సాగు కాగా ఇల్లంతకుంటలో 36,970 ఎకరాలు, ముస్తాబాద్‌లో 23,835 ఎకరాలు, సిరిసిల్ల 5,623 ఎకరాలు, తంగళ్లపల్లి 21,086 ఎకరాలు, వీర్నపల్లి 8,300 ఎకరాలు, ఎల్లారెడ్డిపేట 21,100 ఎకరాలు, బోయినపల్లి 19,167 ఎకరాలు, చందుర్తి 21,367 ఎకరాలు, కోనరావుపేటలో 23,140 ఎకరాలు, రుద్రంగి 10,964, వేములవాడ 10,038 ఎకరాలు, వేములవాడ రూరల్ 15,142 ఎకరాల్లో సాగు చేశారు.

సంక్షిప్త సమాచారం

అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిపై అవగాహన పెంచుకుంటేనే నిర్మూలించవచ్చని టీబీ సూపర్‌వైజర్ మహిపాల్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. 146 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 18 మంది అనుమానుతుల నుంచి తెమడ నమూనాలను సేకరించారు. వైద్యాధికారి సారియాఅంజూమ్, సిబ్బంది పద్మ, ప్రసన్న, భూలక్ష్మీ, అమృత, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యకేంద్రాల ఆవరణలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది చూసుకోవాలని జిల్లా వైద్యాధికారి రజిత పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, దాచారం గ్రామాలలోని ఆరోగ్యకేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు రావని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. దాచారంలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఐవో సంపత్‌కుమార్, ఎన్‌సీడీపీవో రామకృష్ణ, వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాల స్థాయి క్రీడలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడురోజులపాటు కొనసాగిన పాఠశాల స్థాయి క్రీడలు గురువారం ముగిశాయి. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిణి మేకల పావనీ, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ సంపత్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాన బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు సాబీర్, రాజు, రాధారాణి, శ్రావణ్, మామిడి శ్రీను, రాణి, విజయలక్ష్మి, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు మరమ్మతు పనులు పునఃప్రారంభం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డు మరమ్మతు పనులు గురువారం పునఃప్రారంభమయ్యాయి. బైపాస్‌రోడ్డు వెడల్పు చేయడంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఉపాధిహామీ పథకంలో రూ.50లక్షలు మంజూరు చేశారు. కొద్దిరోజులు పనులు శరవేగంగా జరుగగా ఇటీవలే పనులు నిలిచిపోయాయి. బైపాస్‌రోడ్డుపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న నాయకులు తిరిగి పనులు ప్రారంభించారు. మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు మామిడి సంజీవ్, చిట్టి ప్రదీప్‌రెడ్డి, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, రెడ్డి అమరేందర్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

వేములవాడ రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రస్తుత వానాకాలంలో విత్తిన పంటల వివరాలను సమగ్రంగా నమోదు కార్యక్రమానికి రైతులు సహకరించాలని వ్యవసాయ అధికారి వినీత కోరారు. రైతులు పంటల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా పలు ప్రయోజనాలను పొందవచ్చన్నారు. పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

కేసీఆర్ నగర్‌లో సీపీఎం ఇంటింటి సర్వే

తంగళ్లపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల వలయంలో కేసీఆర్ నగర్ వాసులు కాలం వెల్లదీస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. గురువారం మండలంలోని కేసీఆర్‌నగర్‌లో సీపీఎం నాయకులు ఇంటింటి సర్వే నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోసం కేసీఆర్ నగర్ ప్రజలతో కలిసి ఈనెల 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి రమేష్‌చంద్ర శ్రీరాముల, గోవిందు లక్ష్మణ్, మూషం శంకర్, నల్ల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ మండల కార్యవర్గం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూటీఎస్ వీర్నపల్లి మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనకరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలుగా అనూష, మహిళా కార్యదర్శిగా కవితలు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాబు, కృష్ణహరి, సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు.. సమస్యలు పరిష్కారం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లిలో ఈనెల 2న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పర్యటించి సమస్యలను పరిశీలించారు. మురుగు నీటి కాల్వలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో పరిశీలించిన కలెక్టర్ పనులను చేపట్టాలని ఆదేశించారు. గురువారం అధికారులు చిన్నారులకు గ్రామ పంచాయతీ కార్యాలయం భవనంలో ఓ తాత్కాలిక గదిని కేటాయించారు. గ్రామంలో పారిశుధ్య పనులను చేయించారు. మురుగు నీటి కాల్వలను శుభ్రం చేసి రోడ్డుకిరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు.

నర్మాల గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

గంభీరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో గురు వారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం కొందరు విద్యార్థినులు వైరల్ ఫీవర్‌తో పాటు జలుబు, దగ్గుతో బాధపడుతుండటంతో గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. గురువారం లింగన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నర్మాల గురుకుల పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, భారతి, శిల్ప, హేమలత, కల్పలత తదితర సిబ్బందితో పాటు ఆశా వర్కర్లు ఉన్నారు.

గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

రుద్రంగి : ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు జరుపుకోవాలని ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, తెలంగాణ బీడీ,సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలోని బీడి కార్మికులు గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకు ముందుకు బస్టాండ్ నుంచి ప్రదర్శన నిర్వహించారు. తహసీల్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. అరుణ్‌కుమార్, సురేశ్, సులోచన, లాస్య, నవనీత, లక్ష్మీ, సుజాత, రేణుక, లింబవ్వ పాల్గొన్నారు.